క్లుప్తంగా

గంగమ్మ గుడి నిర్మాణానికి విరాళం



చెక్కు అందిస్తున్న వెంకటసాయి మహేష్

చిల్లకూరు: స్థానికంగా గంగమ్మ గుడి నిర్మాణానికి దాత నందవరం వెంకటసాయి మహేష్ రూ.50వేల విరాళం అందించారు. సోమవారం ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేశారు. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ కన్వీనర్ నందవరం సుబ్బారావు మాట్లాడుతూ వెంకటసాయి మహేష్ తన తాత నాదమునిశెట్టి, వసంతమ్మల జ్ఞాపకార్థం విరాళమిచ్చినట్లు వెల్లడించారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు.

'గోరుముద్ద' తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

దక్కిలి: మండలంలోని చాపలపల్లె ప్రాథమిక పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ కె.వెంకటేశ్వర్లు సోమవారం తనిఖీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందించాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సులువుగా అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలను బోధించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. హాజరు పట్టికను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అశోక్, ఉపాధ్యాయని సంధ్యారాణి పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు స్క్రీనింగ్

గూడూరురూరల్: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, బాలాయపల్లి, దక్కిలి మండలాల్లోని ప్రత్యేక అవసరాలు గల 70 మంది పిల్లలకు ఉపకరణాల అందించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఐఈ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్లానింగ్ కో–ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, డిప్యూటీ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయని భారతి, సైకియాట్రిస్ట్ భారతి, ఆర్థోపెడిక్ రాజేశ్వరి, ఫిజియోథెరపిస్ట్ శివకుమార్, ఈఎన్‌టీ రాజేష్, ఆడియాలజిస్ట్ చిరంజీవి, భవిత కేంద్రం టీచర్లు అజయ్‌బాబు, కె.మంగమ్మ పాల్గొన్నారు.

విజయదశమి వేడుకలకు పక్కాగా ఏర్పాట్లు

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ గుడిలో విజయదశమి వేడుకలకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 9 రోజుల పాటు విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆలయ ఈఓ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

అంతరిక్ష అంశాలపై ఫొటో ప్రదర్శన



ఫొటోలు పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ శారదాబాయి

సైదాపురం(వెంకటగిరి): ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను పురస్కరించుకుని వెంకటగిరి గురుకుల జూనియర్ కళాశాలలో సోమవారం అంతరిక్ష అంశాలపై ఫొటో ప్రదర్శన నిర్వహించారు. ప్రిన్సిపల్ శారదాబాయి మాట్లాడుతూ అంతరిక్షంపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. చంద్రయాన్ ప్రయోగానంతరం అంతరిక్ష విశేషాలపై పిల్లలకు మరింత ఆసక్తి పెరిగిందని వెల్లడించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పద్మ, వెంకట్రావు, వినయ్‌కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో చెట్ల నరికివేత



రైల్వే స్టేషన్‌లో నరికేసిన చెట్టు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ సమీపంలోని చెట్లను నరికివేస్తున్నారు. ఏళ్ల తరబడి నీడనిస్తున్న చెట్లను తొలగిస్తుండడంపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్టేషన్‌మాస్టర్‌ను వివరణ కోరగా.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెట్ల కొమ్మలు విరిగి రైల్వే విద్యుత్ లైన్లపై పడ్డాయని, దీంతో వాటిని వెంటనే తొలగించమని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. చెట్ల నరికివేత దాదాపు అన్ని రైల్వేస్టేషన్లలో సాగుతోందని వివరించారు.

నాయుడుపేటలో మందులు పంపిణీ చేసిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు



కాట్రగుంటలో నిర్వహించిన హెల్త్ క్యాంపులో వైద్య సిబ్బంది



రాపూరు మండలం పెనుబర్తిలో వైద్యశిబిరానికి హాజరైన విద్యార్థినులు



ఆరోగ్యానికి అభయం

- పకడ్బందీగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'
- అందుబాటులో వైద్య శిబిరాలు
- స్పెషలిస్ట్ డాక్టర్లతో చికిత్సలు

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది. అందులో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్షను పకడ్బందీగా చేపట్టింది. ముందుగా వలంటీర్లు.. ఏఎన్‌ఎంలతో ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టింది. ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు చేయించి పక్కాగా రిపోర్టులు సిద్ధం చేసింది. అనంతరం సచివాలయాల వారీగా క్యాంపులు ప్రారంభించింది. నిపుణులైన వైద్యులతో అత్యుత్తమ చికిత్సలందిస్తోంది. ఖరీదైన మందులను సైతం ఉచితంగా పంపిణీ చేస్తోంది.



సైదాపురం: రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

నాయుడుపేటటౌన్: పట్టణంలోని తుమ్మూరులో ఉన్న వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 400 మందికి చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉన్నత లక్ష్యంతోనే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే పలువురికి కంటి పరీక్షలు చేసి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలు దారా రవి, ముత్యాలరెడ్డి, ఎమ్మెల్సీ షరీఫ్ పాల్గొన్నారు.

దక్కిలి: మండలంలోని నాగవోలు సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కె.సుజాత, వైద్యాధికారులు పల్లవి, హరిత, లలిత్‌కుమార్ పాల్గొన్నారు.

దక్కిలి (బాలాయపల్లి) మండలంలోని కాట్రగుంట సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కింద వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి కల్యాణచక్రవర్తి, సర్పంచ్‌లు మమత, కమలేశ్వరి, ఎంపీటీసీ సభ్యుడు రామయ్య, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి మోహన్‌రాజు పాల్గొన్నారు.

సైదాపురం: మండలంలోని దేవరవేమూరు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కింద వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మీసాల వెంకటేశ్వర్లు, సర్పంచ్ చెరుకూరి వెంకటరమణమ్మ, వైద్యులు శ్రీధర్ ,శ్రావణి, శాంతి, వివేక్, గురవయ్య పాల్గొన్నారు.

రాపూరు: మండలంలోని పెనుబర్తిలో జగనన్న ఆరోగ్య సురక్ష కింద వైద్యశిబిరం ఏర్పాటు చేసి పలువురికి చికిత్సలందించారు. వైఎస్సార్‌సీపీ నేత పాపకన్ను మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని కొనియాడారు. రోగులకు ఉచితంగా మందులు, అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లీలామోహన్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, వైద్యులు మమత.మధుసూదన్‌రావు, సుదర్శనమ్మ, సూర్యధర్మేంద్ర, నర్మదాదేవి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ అప్పాజీ, తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

కోట: మండలంలోని కొక్కుపాడు సచివాలయం పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో 220 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, ఎంపీటీసీ సభ్యులు హిమబిందు పాల్గొన్నారు. గూడలి–2 సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో డాక్టర్ సౌజన్య 256 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భవానీ, ఉప సర్పంచ్ పల్లెమల్లు విజయసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సర్వే

దొరవారిసత్రం: మండలంలోని ఏకొల్లు, కుప్పారెడ్డిపాళెం, పాళెంపాడు, వెదురుపట్టు తదితర గ్రామాల్లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు.ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

సూళ్లూరుపేట రూరల్: మండలంలోని మన్నేముత్తేరి , మంగళంపాడు, ఉగ్గుముడి, దేగావారికండ్రిగ గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. వైద్యపరీక్షలు చేసి టోకెన్లు పంపిణీ చేశారు.

నేడు అరవపాళెంలో.. సురక్ష

చిట్టమూరు: మండలంలోని అరవపాళెం గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కింద వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్డీ మనోహర్ గౌడ్ సోమవారం తెలిపారు. తిరుపతి,నెల్లూరు నగరాల నుంచి స్పెషలిస్టు వైద్యులు పాల్గొని చికిత్సలతోపాటు ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. అలాగే కంటి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. శస్త్ర చికిత్సలు అవసరమైతే కార్పొరేట్ వైద్యశాలలో ఉచితంగా చేయిస్తారని పేర్కొన్నారు.



దక్కిలి: నాగవోలులో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



రాపూరు: మందులు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత మధుసూదన్‌రెడ్డి



దొరవారిసత్రం: పాళెంపాడులో ఆరోగ్య పరీక్షలు



మన్నేముత్తేరిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



సైదాపురం: రోగిని పరీక్షిస్తున్న వైద్యులు



రాపూరు: వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ముందస్తుగా ఉపాధి ప్రణాళికలు



మాట్లాడుతున్న ఏపీడీ వరప్రసాద్

దక్కిలి (బాలాయపల్లి): ఉపాధి హామీ పనులకు సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఏపీడీ వరప్రసాద్ ఆదేశించారు. సోమవారం బాలాయపల్లె ఉపాధి కార్యాలయంలోఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ గ్రామాల్లో అవసరాలకు ఉపయోగపడేలా పనులు గుర్తించి తీర్మానాలు చేయించుకోవాలని సూచించారు. జాబ్ కార్డుదార్లందరికీ వంద రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందు కృషి చేయాలన్నారు. కూలీలకు పనిచేసే ప్రాంతంలో వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీడీఓ రవీంద్రబాబు, ఈసీ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'

గూడూరురూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందనకు ఆయన హాజరై వినతులు స్వీకరించారు. వెంటనే ఆయా మండలాల తహసీల్దార్లతో ఫోన్‌లో మాట్లాడి సత్వరమే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్డీఓ మాట్లాడుతూ అనుమతులు లేకుండా గ్రావెల్, క్వార్ట్జ ఖనిజాలను తవ్వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అటవీ భూముల్లో అక్రమ తవ్వకాలపై తమకు ఫిర్యాదుల అందినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో దాడులు నిర్వహించి 5 జేసీబీలు, 6 టిప్పర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. అయితే గ్రావెల్ మాఫియా తనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిందని, అయినప్పటికీ తాను ఒత్తిళ్లకు లొంగనని స్పష్టం చేశారు. నిజాయితీగా పనిచేసే తనపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలని, గ్రావెల్ మాఫియా వెనుక ఎంతటి వారున్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

'సాగర్ కా వాచ్'పై అవగాహన



మాట్లాడుతున్న ఎస్ఐ రాకేష్

వాకాడు: మండలంలోని దుగరాజపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో మంగళవారం, బుధవారం సాగర్ కా వాచ్ నిర్వహించనున్నటుల ఎస్ఐ రాకేష్ తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆయన సాగర్ కా వాచ్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా సముద్ర తీరం మైపాడు నుంచి వాకాడు మండలం పులింజేరివారిపాళెం వరకు తీరం వెంబడి సీఐ ఎస్.సత్యనారాయణ ఆధ్వర్యంలో కట్టుదిట్టంగా నిఘా చేపట్టనున్నట్లు వివరించారు. తీవ్రవాదుల ఉనికిని పసిగట్టేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐ నాగయ్య, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

చైతన్యస్ఫూర్తి 'చేగువేరా'



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరురూరల్: ప్రజల అభ్యున్నతికి నిరంతరం పాటుపడిన చైతన్యస్ఫూర్తి చేగువేరా అని ఆర్డీఓ కిరణ్‌కుమార్ కొనియాడారు. సోమవారం మండలంలోని వేములపాళెంలో చేగువేరా ఫౌండేషన్ 11వ వార్షికోత్సవం సందర్భంగా వైఎస్సార్‌సీపీ గ్రామిక విభాగం రాష్ట్ర నాయకుడు మండ్ల రాజేష్ కుమార్తె మండ్ల అజిత జ్ఞాపకార్థం 300 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ సేవకు ప్రతిరూపం చేగువేరా ఫౌండేషన్ అని ప్రశంసించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మండ్ల సురేష్ బాబు మాట్లాడుతూ 2011లో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ చేతుల మీదుగా చేగువేరా ఫౌండేషన్ ప్రారంభించామన్నారు. ఈ పేరు పెట్టింది కూడా అనిల్‌కుమార్ యాదవ్ అని తెలిపారు. సుమారు 11 ఏళ్లుగా ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో చేగువేరా ఫౌండేషన్ అధ్యక్షుడు గుండాల ఆదినారాయణ, కార్యదర్శులు ఎస్‌కే రఫీ, అన్వర్‌బాషా, ఓరేపల్లి బాబు, మధుసూదన్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, టీఆర్ మణి, పైలట్ టీమ్ సభ్యులు సురేష్‌రెడ్డి, కిషోర్, అజయ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, శేషయ్య శ్రీనివాసుల విక్రమ్, సుబ్బారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఉత్తమ అవార్డు



రహంతుల్లాకు అవార్డు అందిస్తున్న తుడా చైర్మన్ మోహిత్ రెడ్డి

చిట్టమూరు: మండలంలోని కొత్తగుంటకు చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ ఉపాధ్యాయుడు షేక్ రహంతుల్లాకు ఉత్తమ అవార్డు లభించింది. సోమవారం ఈ మేరకు తిరుపతిలో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో డీఈఓ శేఖర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు



మాట్లాడుతున్న కౌన్సిలర్ శంకరయ్య

వెంకటగిరిరూరల్: అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేయిస్తామని కౌన్సిలర్ శంకరయ్య తెలిపారు. సోమవారం పట్టణంలోని సుదర్శనం నగర్ సచివాలయంలో నిర్వహించిన స్పందనలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కౌన్సిలర్ మాట్లాడుతూ వార్డులోని సమస్యలను నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

భూ పంపిణీకి వినతి

సైదాపురం: పేదలకు భూములను పంపిణీ చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు డీపీ పోలయ్య కోరారు. సోమవారం ఈ మేరకు తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. కొందరు బడాబాబుల కబ్జాలోని ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలని సూచించారు.

కండలేరులో 11.678 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమ వారం నాటికి 11.678 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు.హెడ్ రెగ్యులేటర్ నుంచి 50 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్‌కు 10 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నట్లు వివరించారు.

రోడ్డుప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలు



చికిత్సపొందుతున్న డ్రైవర్ రాజా

నాయుడుపేటటౌన్: మండలంలోని మేనకూరు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ గాయపడ్డాడు. వివరాలు.. వెంకటగిరి నుంచి నాయుడుపేటకు వస్తున్న లారీ మార్గం మధ్యలో ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొంది. ఈ ప్రమాదంలో చెన్నైకు చెందిన లారీ డ్రైవర్ రాజాకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడికి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ భూముల పరిశీలన



భూములు పరిశీలిస్తున్న డీఎఫ్ఓ చంద్రశేఖర్

రాపూరు: మండలంలోని పంగిలి గ్రామం సర్వే నంబర్–1లోని భూములను సోమవారం సాయంత్రం నెల్లూరు జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రీసర్వే అనంతరం అటవీ భూముల హద్దులను తనిఖీ చేసినట్లు తెలిపారు. అటవీ భూముల పరిరక్షణకు ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు సమష్టిగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఎంత భూమి ఖాళీగా ఉంది, ఎంత మందికి పట్టాలు పంపిణీ చేశారు, ఎన్ని చెరువులు, కుంటలు ఉన్నాయనే విషయాలను సమగ్రంగా పరిశీలించినట్లు వివరించారు. కార్యక్రమంలో రేంజర్ రవీంద్రబాబు ,తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం





గూడూరులో పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్ షరీనా, చిల్లకూరు : చింతవరంలో డాక్టర్ శ్రీపావని

గూడూరు రూరల్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి వద్ద సోమవారం జేవీవీ ఆధ్వర్యంలో గుర్రం విజయ్‌బాబు వితరణగా అందించిన పౌష్టికాహారాన్ని గర్భిణులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ రాజా, జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, బాలకృష్ణంరాజు, ఇక్షిత, చెంచునారాయణ, పురుషోత్తమరావు, ప్రభాకర్, పవన్, మస్తాన్, విజయ్, జగదీష్, వరప్రసాద్ పాల్గొన్నారు.

చిల్లకూరు: మండలంలోని చింతవరం పీహెచ్‌సీలో సోమవారం చేడిమాలకు చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శ్రీపావని మాట్లాడుతూ రక్తహీనతను అధిగమించేందుకు పౌష్టికాహారం భుజించాలని సూచించారు. గర్భిణులు తమకు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అందించే చిక్కీలు, పాలు, కోడిగుడ్లు, రాగి పిండి, ఎండు ఖర్జూరం తదితరాలను క్రమం తప్పక తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పాల్‌జాన్సన్, ట్రస్టు అధ్యక్షుడు రాజనేని పిచ్చయ్యనాయుడు, ప్రతినిధులు బాబు, బాస్కర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బావి పూడ్చివేతకు చర్యలు

– సాక్షి ఎఫెక్ట్



బావిని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ మాణిక్యం

చిల్లకూరు: మండలంలోని ముత్యాలపాడు పంచాయతీ నాంచారమ్మపేట ముస్లిం కాలనీలో నిరుపయోగంగా ఉన్న బావిని స్థానికుల సహకారంతో పూడ్చేందుకు చర్యలు చేపడతామని ఈఓపీఆర్డీ మాణిక్యం తెలిపారు. బావి వినియోగంలో లేకపోవడంతో అందులో కొందరు వ్యర్థాలు పడేస్తున్నారని, దీంతో దుర్వాసన వెదజల్లుతోందని సాక్షి పత్రికలో ×నాడు దాహం తీర్చింది.. నేడు దుర్గంధంగా మారింది× అనే శీర్షికతో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఈఓపీఆర్డీ వెంటనే గ్రామానికి వెళ్లి బావిని పరిశీలించారు. తొలుత ఆ ప్రాంతంలో బ్లీచింగ్ చల్లి పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. త్వరలోనే బావిని పూడ్చిస్తామని హామీ ఇవ్వడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.